TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com
adaabcyberabad@gmail.com

ఎడిటర్ : బిల్లాల్‌పూర్‌సారా శివ కుమార్ | సంపుటి : 1 | సంచిక : 15 | బుధవారం, జూలై 29, 2026 | పేజీలు - 4 | వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR | VOLUME : 1 | ISSUE: 15 | 29-07-2026 (WEDNESDAY) | PAGES: 4 | RS : 5/-

## చార్ ధామ్ యాత్ర నిలిపివేత

### ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సాధారణ జనజీవనం తీవ్రంగా అస్తవ్యస్తమైంది. కొండచరియలు విరిగిపడటంతో చార్ ధామ్ యాత్ర మార్గాలు పలు చోట్ల మూసుకుపోయాయి. యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని చార్ ధామ్ యాత్రను బుధవారం వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన తర్వాత యాత్రను తిరిగి ప్రారంభించనున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలోని ప్రధాన నదులన్నీ ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కొండచరియలు విరిగిపడటం, రాళ్లు, మట్టి రహదారులపైకి చేరడంతో జాతీయ రహదారులు, కొండ ప్రాంతాల గ్రామీణ రహదారులపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. ప్రమాదకర ప్రాంతాల్లో విపత్తు నిర్వహణ, సహాయక బృందాలను అప్రమత్తంగా ఉంచి అవసరమైన చర్యలు చేపడుతోంది. ఇదిలా ఉండగా, భారత వాతావరణ శాఖ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు, యాత్రికులు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించింది.

## శాసనసభ కమిటీల తొలి సమావేశం

- కమిటీల పనితీరు ప్రజాస్వామ్యానికి కీలకం
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వ్యాఖ్య
- కమిటీల చైర్మన్లకు శుభాకాంక్షలు



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో మంగళవారం శాసనసభ ప్రభుత్వ హామీల అమలు కమిటీ , నియమాల కమిటీ , నైతిక విలువల కమిటీల తొలి సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ప్రభుత్వ హామీల అమలు కమిటీ సమావేశంలో చైర్మన్ పటోళ్ల సంజీవరెడ్డి, సభ్యులు జె. అనిరుధ్ రెడ్డి, జారే ఆదినారాయణ పాల్గొన్నారు. రూల్స్ కమిటీ సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షత వహించగా, సభ్యులు దానం నాగేందర్, తూడి మెఘారెడ్డి, భూక్యా మురళి నాయక్ హాజరయ్యారు. నైతిక విలువల కమిటీ సమావేశానికి చైర్మన్ రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షత వహించగా, సభ్యుడు జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. కౌన్సిల్ సెక్రటరీ డా. వి. నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి కూడా సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ,
హామీల అమలు కమిటీ చైర్మన్ పటోళ్ల సంజీవరెడ్డి, ఎథిక్స్ కమిటీ చైర్మన్ రేవూరి ప్రకాష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కమిటీల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం సభలో ఇచ్చిన హామీల అమలును పర్యవేక్షించే బాధ్యత హామీల కమిటీపై ఉంటుందని, ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. నియమాల కమిటీ శాసనసభను క్రమబద్ధంగా, సమర్థవంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని స్పీకర్ అన్నారు. శాసనసభ చట్టాలతో పాటు సభ్యుల ప్రవర్తన, నిబద్ధత, వ్యవహార శైలి ద్వారానే ప్రజల విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల నమ్మకాన్ని బలోపేతం చేయడానికే ప్రపంచవ్యాప్తంగా ఎథిక్స్ కమిటీలు ఏర్పడ్డాయని, రాగద్వేషాలకు అతీతంగా, నిష్పక్షపాతంగా కమిటీలు పనిచేయాలని సూచించారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, కమిటీల చైర్మన్లకు శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ సభ్యులకు మొదట అందించేది రూల్స్ బుక్ అని, దాని ప్రకారమే స్పీకర్ సభను నిర్వహిస్తారని చెప్పారు. గత ప్రభుత్వంలో రూల్స్ బుక్‌లో మార్పులు జరిగాయని పేర్కొంటూ, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా కొత్త నిబంధనలతో రూల్స్ బుక్‌ను రూపొందించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఇతర రాష్ట్రాల శాసనసభలను అధ్యయనం చేసి అక్కడ అమలవుతున్న ఉత్తమ విధానాలను పరిశీలించి తెలంగాణలో అమలు చేయాలని సూచించారు. సభలో నియమాలు పాటించేలా చూడటంతో పాటు సభ హుందాతనాన్ని కాపాడటంలో ఎథిక్స్ కమిటీ కీలక పాత్ర పోషించాలని అన్నారు. కమిటీల నిర్ణయాలు పారదర్శకంగా ఉండి తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపేలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కమిటీల చైర్మన్లు మాట్లాడుతూ, శాసనసభ తమపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేసి సభ గౌరవాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## 500 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల ఫలితాలు విడుదల



ఆదాబ్ సైబరాబాద్,హైదరాబాద్: తెలంగాణ డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (తెలంగాణ వైద్య విధాన పరిషత్) పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో మరో కీలక ముందడుగు పడింది. జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ విభాగాల్లోని మొత్తం 500 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం విడుదల చేసింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరతను తీర్చడం, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం మొత్తం 1,616 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో ఇప్పటికే అనస్థీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ విభాగాలకు చెందిన 692 పోస్టుల భర్తీ పూర్తికాగా, ఎంపికైన వైద్యులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేసి, పోస్టింగ్స్ కూడా కేటాయించారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో జనరల్ సర్జరీ -174, జనరల్ మెడిసిన్ -166, ఆర్థోపెడిక్స్ -89, రేడియాలజీ -71 పోస్టులు ఉన్నాయి. ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల అనంతరం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి, తుది ఎంపిక జాబితాను ఎంహెచ్ఎస్ఆర్‌బీ ప్రకటించింది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను ఎంహెచ్ఎస్ఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఎంపికైన స్పెషలిస్ట్ డాక్టర్లకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత పూర్తిగా నివారించాలన్న లక్ష్యంతో 24 విభాగాల్లో 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులను భర్తీ చేస్తున్నామని, ఇప్పటివరకు 1,192 పోస్టుల భర్తీ పూర్తయిందని మంత్రి వెల్లడించారు.


## అస్సాం వరదలపై ప్రధాని మోదీ సమీక్ష



ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ : అస్సాంలో కొనసాగుతున్న వరద పరిస్థితిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన స్థానిక పార్లమెంటు సభ్యులతో సమావేశమై వరద ప్రభావం, సహాయక చర్యలు, ప్రజల పరిస్థితిపై చర్చించారు. వరద బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అస్సాం ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేస్తోందని ప్రధాని స్పష్టం చేశారు. సహాయక చర్యలను వేగవంతం చేసి బాధితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ స్పందిస్తూ, "అస్సాంలో ప్రస్తుతం నెలకొన్న వరద పరిస్థితిపై స్థానిక ఎంపీలతో చర్చించాను. వరద బాధితులకు సహాయం చేసేందుకు అస్సాం ప్రభుత్వంతో కలిసి కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుంది. ప్రతి ఒక్కరి భద్రత, సంక్షేమం కోసం నేను ప్రార్థిస్తున్నాను" అని పేర్కొన్నారు. అస్సాంలో భారీ వర్షాల కారణంగా పలు జిల్లాలు వరద ముప్పును ఎదుర్కొంటుండగా, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కేంద్రం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపింది.

## "ఆపరేషన్ నవజీవన్-2" సక్సెస్

- ఝార్ఖండ్‌లో 16 మంది మావోయిస్టుల లొంగుబాటు..
- భారీ ఆయుధాల స్వాధీనం



ఆదాబ్ సైబరాబాద్,రాంచీ : ఝార్ఖండ్ పోలీసుల "నయా దిశా-నయా పహల్" నక్సల్ వ్యతిరేక ప్రచారంలో కీలక విజయం లభించింది. కొల్హాన్, లాతేహార్ ప్రాంతాలకు చెందిన 16 మంది క్రియాశీల మావోయిస్టులు మంగళవారం రాంచీలో ఝార్ఖండ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఒక ప్రాంతీయ కమాండర్, ముగ్గురు జోనల్ కమాండర్లు, ముగ్గురు ఉప జోనల్ కమాండర్లు, ఆరుగురు ఏరియా కమాండర్లు, ముగ్గురు సాధారణ సభ్యులు ఉన్నారు. వీరిలో రూ.15 లక్షల రివార్డు ప్రకటించిన ప్రాంతీయ కమాండర్ సంతోష్ అలియాస్ బసుదేవ్ కూడా ఉన్నాడు. ఝార్ఖండ్ పోలీసు డైరెక్టర్ జనరల్ తదాషా మిశ్రా మాట్లాడుతూ, లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం అన్ని ప్రయోజనాలు కల్పిస్తామని తెలిపారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు 11 అత్యాధునిక తుపాకులు, 38 మ్యాగజైన్లు, 1,562 రౌండ్ల మందుగుండు సామగ్రిని పోలీసులకు అప్పగించారు. ఝార్ఖండ్ పోలీసులు, కేంద్ర రిజర్వు పోలీసు దళం, కోబ్రా బలగాలు, ఝార్ఖండ్ జాగ్వార్ సంయుక్తంగా నిర్వహించిన "ఆపరేషన్ నవజీవన్--2" ఫలితంగానే ఈ లొంగుబాటు సాధ్యమైందని అధికారులు తెలిపారు. ఈ పరిణామం ఝార్ఖండ్‌లో నక్సల్ నిర్మూలన చర్యలకు మరింత ఊతమిస్తుందని భావిస్తున్నారు.

## నాందేడ్ డివిజన్‌లో రైల్వే విద్యుత్ వ్యవస్థ ఆధునికీకరణ

### రూ.163 కోట్ల భారతీయ రైల్వే ఆమోదం

ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ : దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని నాందేడ్ డివిజన్‌లో పర్భాణి--ముద్ఖేడ్ డబుల్ లైన్ సెక్షన్‌లో ఎలక్ట్రిక్ ట్రాక్షన్ వ్యవస్థను ఆధునికీకరించేందుకు భారతీయ రైల్వే రూ.163 కోట్లతో కీలక ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేసి, నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు వెల్లడించింది. ఈ ప్రాజెక్టు కింద ప్రస్తుతం అమల్లో ఉన్న 1ఐ25 కేవీ విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థను తొలగించి, 164 కిలోమీటర్ల మేర అత్యాధునిక 2ఐ25 కేవీ విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. పెరిగిన విద్యుత్ లోడ్‌ను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన విద్యుత్ సరఫరా మౌలిక సదుపాయాలను కూడా అభివృద్ధి చేయనున్నారు. పర్భాణి--ముద్ఖేడ్ సెక్షన్ దేశంలోని అత్యంత రద్దీ రైల్వే మార్గాల్లో ఒకటైన అధిక వినియోగ నెట్‌వర్క్ రూట్--9లో భాగంగా ఉంది. ఈ మార్గం అజ్మీర్, ఇండోర్, ఖాండ్వా, అకోలా, పూర్ణ, ముద్ఖేడ్, సికింద్రాబాద్, మహబూబ్‌నగర్, ధోన్ ప్రాంతాలను అనుసంధానిస్తుంది. ఆధునికీకరణ అనంతరం రైళ్లకు మరింత స్థిరమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి రావడంతో అధిక పరిమాణంలో సరుకు రవాణా నిర్వహించడంతో పాటు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిర్వహణకు కూడా ఈ ప్రాజెక్టు దోహదం చేయనుంది. 2029--30 నాటికి 3,000 మిలియన్ టన్నుల సరుకు రవాణా లక్ష్యాన్ని సాధించాలన్న భారతీయ రైల్వే లక్ష్యానికి ఇది కీలకంగా ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా అధిక రద్దీ ఉన్న రైల్వే కారిడార్లలో విద్యుత్ మౌలిక వసతులను ఆధునికీకరించి, రైల్వే కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా భారతీయ రైల్వే చేపడుతున్న చర్యల్లో ఈ ప్రాజెక్టు మరో ముఖ్యమైన ముందడుగుగా నిలవనుంది.



## సైబర్ మోసాలపై కేంద్రం ఉక్కుపాదం

### రూ.11,158 కోట్ల మోసాలను అడ్డుకున్న కేంద్ర ప్రభుత్వం



ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ : దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కీలక చర్యలు చేపట్టిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇస్తూ, ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ద్వారా దేశవ్యాప్తంగా సైబర్ నేరాల నియంత్రణ, సమన్వయం, దర్యాప్తుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. భారత రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్ ప్రకారం పోలీసు, శాంతిభద్రతలు రాష్ట్రాల పరిధిలోకి వస్తాయని, అయినప్పటికీ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట అమలు సంస్థలకు కేంద్ర ప్రభుత్వం సాంకేతిక, ఆర్థిక సహకారం అందిస్తోందని తెలిపారు. జూన్ 30, 2026 నాటికి పౌరుల ఆర్థిక సైబర్ మోసాల ఫిర్యాదుల నిర్వహణ వ్యవస్థ ద్వారా 32.80 లక్షల ఫిర్యాదులు నమోదు కాగా, సుమారు రూ.11,158 కోట్ల ప్రజల సొమ్ము మోసగాళ్ల చేతికి వెళ్లకుండా అడ్డుకున్నట్లు వెల్లడించారు. సైబర్ ఆర్థిక మోసాలపై వెంటనే ఫిర్యాదు చేసేందుకు 1930 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జాతీయ సైబర్ నేరాల ఫిర్యాదు వేదిక ద్వారా అన్ని రకాల సైబర్ నేరాలపై ప్రజలు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం కల్పించామని చెప్పారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 15.75 లక్షలకు పైగా సిమ్ కార్డులు, 5.77 లక్షల ఐఎంఈఐ నంబర్లను బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థల సహకారంతో అనుమానితుల గుర్తింపు వ్యవస్థను ఏర్పాటు చేసి, రూ.25,698 కోట్ల విలువైన అనుమానాస్పద లావాదేవీలను నిలిపివేసినట్లు తెలిపారు. అలాగే సైబర్ నేరాల దర్యాప్తు కోసం రూపొందించిన సమన్వయ వేదిక ద్వారా ఇప్పటివరకు 29,837 మందికి పైగా నిందితులను అరెస్టు చేయగా, 2.33 లక్షలకు పైగా దర్యాప్తు సహాయ అభ్యర్థనలు నమోదు అయ్యాయని వెల్లడించారు. సైబర్ భద్రతను మరింత బలోపేతం చేయడానికి సైబర్ కమాండో కార్యక్రమాన్ని ప్రారంభించి ఇప్పటికే 281 మంది ప్రత్యేక శిక్షణ పొందిన కమాండోలను సిద్ధం చేసినట్లు తెలిపారు. అలాగే పోలీసు అధికారులు, న్యాయ అధికారుల శిక్షణ కోసం ఏర్పాటు చేసిన సైట్రెయిన్ వేదికలో 1.63 లక్షలకు పైగా అధికారులు నమోదు చేసుకోగా, 1.61 లక్షలకు పైగా ధ్రువపత్రాలు జారీ చేసినట్లు వెల్లడించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కాలర్ ట్యూన్లు, సందేశాలు, టెలివిజన్, రేడియో, సామాజిక మాధ్యమాలు, పాఠశాలలు, సినిమా థియేటర్లు, మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వడం లేదా జాతీయ సైబర్ నేరాల ఫిర్యాదు వేదికలో ఫిర్యాదు నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సూచించింది.

బుధవారం,
జూలై 29, 2026

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD



# రెండేళ్ల హైడ్రా..

■ 3,325 ఎకరాల ప్రభుత్వ భూమి పరిరక్షణ – రూ.1.50 లక్షల కోట్ల ఆస్తికి రక్షణ



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్: నగరంలో వరదల నియంత్రణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ రెండేళ్లలో కీలక విజయాలను నమోదు చేసింది. 2024 జూలై 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన హైడ్రా ఇప్పటివరకు 3,325 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకుని, సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడింది.

### గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి

వేగవంతమైన పట్టణీకరణ, చెరువుల ఆక్రమణలు, నాలాల కుదింపు కారణంగా హైదరాబాద్‌లో వరదలు, నీటి కొరత, పర్యావరణ సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు హైడ్రా గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను పునరుద్ధరిస్తోంది. వర్షపు నీటి సహజ ప్రవాహాన్ని పునరుద్ధరించి నగరంలో వరదల నియంత్రణతో పాటు భూగర్భ జలాల పెంపు, పచ్చదనం విస్తరణ లక్ష్యంగా చర్యలు చేపడుతోంది.

### 6 చెరువులు పూర్తయ్యాయి.. మరో 14 అభివృద్ధిలో

మొదటి విడతలో అంబర్‌పేట బతుకమ్మకుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, మాధాపూర్ తమ్మిడికుంట, సున్నం చెరువు, ఉప్పల్ నల్లచెరువు, పాతబస్తీలోని బమ్రుకున్-ఉద్-దౌలా చెరువులను అభివృద్ధి చేసింది. ప్రస్తుతం రెండో విడతలో మరో 14 చెరువుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. అదనంగా నగర నలుదిక్కులా నాలుగు పెద్ద చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌లుగా తీర్చిదిద్దే పనులు చేపట్టింది.

### ప్రభుత్వ భూముల పరిరక్షణలో భారీ చర్యలు
### రెండేళ్లలో హైడ్రా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్లలో భాగంగా:

2,665 ఎకరాల ప్రభుత్వ భూములు
454.11 ఎకరాల చెరువు భూములు
90.39 ఎకరాల పార్కు స్థలాలు
25.37 ఎకరాల నాలాల భూములు
62.18 ఎకరాల రహదారులు, ఫుట్‌పాత్‌లు
26.31 ఎకరాల ప్రజావసరాల భూములు
మొత్తంగా 3,325 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి విడిపించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొచ్చింది.

### -వరద నియంత్రణలో ఫలితాలు

అమీర్‌పేట్ మెట్రో పరిసరాలు, కృష్ణానగర్, ప్యాట్నీ నాలా, శ్రీరాంనగర్, గురునాథ్ చెరువు, ఖాజాగూడ చెరువు, మల్కం చెరువు తదితర ప్రాంతాల్లో నాలాలు, ఇన్‌లెట్లను పునరుద్ధరించి వరద సమస్యలను గణనీయంగా తగ్గించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా ప్యాట్నీ నాలా విస్తరణతో సుమారు 40 వేల కుటుంబాలకు వరద ముప్పు తగ్గిందని వెల్లడించారు.

### -పలు జిల్లాల్లో ప్రభుత్వ భూముల రక్షణ

అమీన్‌పూర్, గాజులరామారం, కొండాపూర్, పీర్జాదిగూడ, సికింద్రాబాద్ కంటోన్మెంట్, బహదూర్‌గూడ, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో వందల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. భవిష్యత్తులో ఈ భూములను విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజావసరాల ప్రాజెక్టుల కోసం వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.

### ప్రజలకు ఉపయోగపడే చెరువుల అభివృద్ధి

చెరువులను కేవలం నీటి నిల్వ కేంద్రాలుగానే కాకుండా, వాకింగ్ ట్రాక్‌లు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల ఆటస్థలాలు, పచ్చదనం కలిగిన ప్రజా వినియోగ ప్రదేశాలుగా అభివృద్ధి చేస్తోంది. దీని ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యమని హైడ్రా అధికారులు తెలిపారు.

నగరంలో వరదలు లేని, పర్యావరణ హితమైన, సుస్థిర హైదరాబాద్ నిర్మాణమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా హైడ్రా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

# “హైడ్రా కాదు.. హైడ్రోజన్ బాంబు”



■ హైకోర్టు వ్యాఖ్యలకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ స్వాగతం
■ సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరపాలని డిమాండ్

ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహార తీరుపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ స్వాగతించారు. పేట్ బషీరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హైడ్రా చర్యలపై సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైడ్రా కమిషనర్‌ను తొలగించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశం పేద ప్రజల విజయమని, బీఆర్ఎస్ పేదల పక్షాన చేసిన పోరాటానికి ఇది న్యాయపరమైన గుర్తింపుగా నిలిచిందని అన్నారు. ప్రభుత్వం రాజ్యాంగానికి అనుగుణంగా కాకుండా వ్యవహరించిందనే విషయాన్ని ఈ తీర్పు స్పష్టం చేసిందని పేర్కొన్నారు.

హైడ్రాను ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించిందని ఆరోపించిన ఆయన, “తమకు నచ్చిన వారికి నజరానా.. నచ్చని వారికి జరిమానా” అనే విధానాన్ని అమలు చేశారని విమర్శించారు. విపత్తుల సమయంలో ప్రజలకు అండగా ఉండాల్సిన సంస్థ ప్రజలను మరింత ఇబ్బందులకు గురి చేసిందని, హైడ్రా వల్ల జరిగిన మేలు స్వల్పమైతే, నష్టం మాత్రం అపారమని వ్యాఖ్యానించారు. హైకోర్టుకు క్షమాపణ చెప్పిన కమిషనర్, తనను తొలగించాలని న్యాయస్థానం ఆదేశించిన తర్వాత కూడా తన చర్యలను సమర్థించుకోవడం సరికాదని అన్నారు. న్యాయవ్యవస్థను గౌరవిస్తారా లేక అధికారుల చర్యలను సమర్థిస్తారా అన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. హైడ్రా మున్సిపల్ శాఖ పరిధిలో పనిచేస్తున్నందున, హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో మున్సిపల్ శాఖ మంత్రిగా కొనసాగేందుకు ముఖ్యమంత్రి నైతిక అర్హత కోల్పోయారని విమర్శించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ, అదే విధంగా ముఖ్యమంత్రి కూడా మున్సిపల్ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా వంటి వ్యవస్థ పేద, మధ్యతరగతి ప్రజలకు “హైడ్రోజన్ బాంబు”లా మారిందని ఆరోపించిన ఆయన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికే హైడ్రాను రద్దు చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. కమిషనర్ మారినా ప్రభుత్వ వైఖరి మారకపోతే హైడ్రా తీరు మారదని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల దృష్టి మళ్లించేందుకు రోజుకో అంశాన్ని తెరపైకి తీసుకొస్తోందని విమర్శించిన కేపీ వివేకానంద్, హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు వ్యాఖ్యలతో ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కామన్వెల్త్ క్రీడల్లో శిల్పా కాంస్యం..
## ప్రధాని మోదీ అభినందనలు



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : గ్లాస్గోలో జరుగుతున్న 2026 కామన్వెల్త్ క్రీడల్లో మహిళల షాట్‌పుట్ ఎఫ్57 విభాగంలో భారత పారా అథ్లెట్ శిల్పా కంచుగరకొప్పాలు శైల కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ విజయంతో భారత్‌కు మరో పతకం అందించిన శిల్పపై దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శిల్పను అభినందించారు. తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి కాంస్య పతకాన్ని సాధించడం విశేషమని కొనియాడారు. సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ వేదికగా ప్రధాని మోదీ స్పందిస్తూ, 2026 కామన్వెల్త్ క్రీడల్లో శిల్పా కంచుగరకొప్పాలు శైల అద్భుత ప్రదర్శన కనబరిచారు. మహిళల షాట్‌పుట్ ఎఫ్57 ఫైనల్లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నందుకు ఆమెకు హృదయపూర్వక అభినందనలు. ఇది ఆమె కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన. ఈ విజయం నిజంగా ప్రశంసనీయం అని పేర్కొన్నారు. శిల్ప సాధించిన ఈ విజయం భారత పారా క్రీడాకారిణుల ప్రతిభను మరోసారి ప్రపంచానికి చాటిందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి
### జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ చంద్రశేఖర్



ఆదాబ్ సైబరాబాద్, శంకర్ పల్లి :-రంగారెడ్డి జిల్లా శంకర్పల్లి మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో జలసిరి కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జలసిరి కార్యక్రమం అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి, పనుల అమలుకు సంబంధించిన పలు సాంకేతిక సూచనలు చేశారు. గ్రామాల్లో అధిక సంఖ్యలో కూలీలకు ఉపాధి కల్పించేలా పనులు చేపట్టాలని, వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భూగర్భ జలాల మట్టం పెరిగేలా నీటి సంరక్షణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్, డీఈ (ఎంపీవో) గిరిరాజ్, ఏఈ నందకిషోర్, ఏపీవో నాగభూషణం, ఈసీ జనార్దన్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## కుషాయిగూడలో 40కి పైగా వీధి లైట్లు దెబ్బతిన్నాయి
### వెల్ఫేర్ అసోసియేషన్ వినతికి డిప్యూటీ కమిషనర్ పోతుల రవీందర్ సాగర్ తక్షణ స్పందన



ఆదాబ్ సైబరాబాద్ , కుషాయిగూడ : పవర్ ఫ్లక్చుయేషన్ కారణంగా కుషాయిగూడ ప్రాంతంలో 40కి పైగా వీధి లైట్లు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కాప్రా మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ పోతుల రవీందర్ సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యపై వెంటనే స్పందించిన డిప్యూటీ కమిషనర్ సంబంధిత ఎలక్ట్రికల్ డీఈ అనితకు అత్యవసరంగా పరిశీలించి, చెడిపోయిన వీధి లైట్లను మరమ్మతు చేయడంతో పాటు అవసరమైన చోట కొత్త ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించిన డిప్యూటీ కమిషనర్‌కు కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్, సలహాదారుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పండాల గణేష్ గౌడ్, కార్యదర్శి శీలం అనిల్ యాదవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD
బుధవారం,
జూలై 29, 2026



# 'హబ్ అండ్ స్పోక్' అంతర్జాతీయ విమాన సర్వీసులకు శ్రీకారం

## అమృత్‌సర్ రెండో స్పోక్ విమానాశ్రయం - అంతర్జాతీయ అనుసంధానంలో భారత్‌కు మరో మైలురాయి



ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ : దేశాన్ని ప్రపంచ స్థాయి విమానయాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అమృత్‌సర్ నుంచి 'హబ్ అండ్ స్పోక్' అంతర్జాతీయ వైమానిక కార్యకలాపాలను మంగళవారం ప్రారంభించింది. ఈ విధానంలో భాగంగా అమృత్‌సర్ దేశంలోని రెండో స్పోక్ విమానాశ్రయంగా అవతరించింది. అంతకుముందు జూన్ 25న వారణాసి నుంచి తొలి హబ్ అండ్ స్పోక్ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వీడియో సందేశం ద్వారా మాట్లాడుతూ, హబ్ అండ్ స్పోక్ విధానం కేవలం విమానయాన నమూనా మాత్రమే కాదని, ఇది భారత అంతర్జాతీయ అనుసంధానానికి కొత్త అవకాశాల ద్వారమని పేర్కొన్నారు. ఢిల్లీ హబ్‌గా సేవలందిస్తుండగా, పంజాబ్, జమ్మూ-కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ ప్రాంతాలకు అమృత్‌సర్ ప్రధాన అంతర్జాతీయ ప్రవేశద్వారంగా మారనుందని తెలిపారు.

-ప్రయాణికులకు భారీ ఊరట

ఈ విధానం అమల్లోకి రావడంతో అమృత్‌సర్ నుంచే ప్రయాణికులు చెక్-ఇన్, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ప్రక్రియలను పూర్తి చేసుకుని, వారి లగేజీని నేరుగా తుది అంతర్జాతీయ గమ్యస్థానానికి పంపే అవకాశం లభిస్తుంది. ఢిల్లీలో మళ్లీ చెక్-ఇన్ లేదా ఇమ్మిగ్రేషన్ అవసరం లేకుండా తదుపరి అంతర్జాతీయ విమానంలో సులభంగా ప్రయాణించవచ్చు. ఇప్పటి వరకు అమృత్‌సర్ నుంచి కేవలం 7 అంతర్జాతీయ గమ్యస్థానాలకు మాత్రమే ప్రత్యక్ష అనుసంధానం ఉండగా, కొత్త విధానంతో ఒకే చెక్-ఇన్, ఒకే లగేజీ ట్యాగ్‌తో 20కి పైగా అంతర్జాతీయ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం కలుగుతుంది.

-ఉపాధి, ఆర్థికాభివృద్ధికి ఊతం

ఈ కార్యక్రమం వల్ల పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతమిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. మంత్రిత్వశాఖ అంచనాల ప్రకారం 2030 నాటికి సుమారు 4 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడటంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థకు 30 బిలియన్ డాలర్ల అదనపు ప్రయోజనం చేకూరనుంది. 2047 నాటికి 1.6 కోట్లకు పైగా ఉద్యోగాలు ఏర్పడి, దేశ ఆర్థిక వ్యవస్థకు 1.4 ట్రిలియన్ డాలర్ల మేర దోహదం చేసే అవకాశముందని అంచనా.

-రోజుకు వందలాది ప్రయాణికులకు ప్రయోజనం

విమానయాన సంస్థల అంచనాల ప్రకారం ఢిల్లీ మీదుగా అమృత్‌సర్ నుంచి రోజుకు సుమారు 250 మంది ప్రయాణికులు ఈ సేవల ద్వారా ప్రయోజనం పొందనున్నారు. భవిష్యత్తులో మరిన్ని స్పోక్ విమానాశ్రయాలను ఈ నెట్‌వర్క్‌లో చేర్చడంతో రోజుకు 1,200 మంది, సంవత్సరానికి సుమారు 4.5 లక్షల మంది ప్రయాణికులకు ఈ సౌకర్యం అందుబాటులోకి రానుంది. ప్రభుత్వం చేపట్టిన ఈ హబ్ అండ్ స్పోక్ వ్యూహం ద్వారా విదేశీ విమానయాన కేంద్రాలపై ఆధారపడటాన్ని తగ్గించి, భారతీయ విమానాశ్రయాలను ప్రపంచ స్థాయి అంతర్జాతీయ హబ్‌లుగా అభివృద్ధి చేయడం, దేశ విమానయాన రంగ పోటీతత్వాన్ని మరింత పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం 'వికసిత్ భారత్ ఏ2047' లక్ష్య సాధనలో కీలక అడుగుగా ప్రభుత్వం అభివర్ణించింది.

# తెలంగాణ టెలివిజన్ అవార్డులకు రూపకల్పన వేగవంతం..

## తెలంగాణ ఆత్మ ప్రతిబింబించేలా లోగో, పేరు ఉండాలి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి





ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనున్న టెలివిజన్ (టీవీ) అవార్డుల రూపకల్పనపై కీలక ముందడుగు వేసింది. అవార్డుల మార్గదర్శకాలు, లోగో, అవార్డుల పేర్లు, ఎంపిక విధానం తదితర అంశాలపై సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధ్యక్షతన టెలివిజన్ అవార్డుల కమిటీతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) మేనేజింగ్ డైరెక్టర్ ముకుంద రెడ్డి, టెలివిజన్ అవార్డుల కమిటీ ఛైర్మన్, సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో టెలివిజన్ అవార్డులకు ప్రత్యేక లోగో రూపకల్పన, ప్రముఖ వ్యక్తి పేరును అవార్డులకు నామకరణం చేయడం, వివిధ విభాగాల్లో అవార్డుల ప్రదానం, ఎంపిక విధానం, అవార్డుల ప్రదానోత్సవ వేదికల ఎంపిక వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, టెలివిజన్ అత్యధిక మందికి వినోదాన్ని అందించే శక్తివంతమైన మాధ్యమమని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు టెలివిజన్ కార్యక్రమాల పట్ల విశేష ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. టెలివిజన్ రంగంలో ప్రతిభ కనబరిచిన నటీనటులు, దర్శకులు, రచయితలు, సాంకేతిక నిపుణులు, సామాజిక సందేశాలను అందించే సీరియళ్లు, కార్యక్రమాలు, బాలల కార్యక్రమాలను రూపొందించే వారిని ప్రోత్సహించేలా అవార్డులను రూపొందిస్తామని చెప్పారు. కమిటీ సభ్యుల సూచన మేరకు టెలివిజన్ అవార్డులకు మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు పేరు పెట్టే అంశాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని మంత్రి తెలిపారు.

బహుభాషా కోవిదుడైన పి.వి. నరసింహారావు దేశ ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన మహనీయుడని, అలాంటి విశిష్ట వ్యక్తుల పేర్లను పరిశీలించడంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. అవార్డులకు సంబంధించిన మార్గదర్శకాలు, లోగో, పేర్ల రూపకల్పనను వీలైనంత త్వరగా పూర్తి చేసి సమర్పించాలని కమిటీని మంత్రి ఆదేశించారు. అవార్డుల పేరు, లోగో తెలంగాణ ఆత్మ, సంస్కృతి, ప్రత్యేకతను ప్రతిబింబించేలా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో తొలిసారిగా ప్రదానం చేయనున్న ఈ టెలివిజన్ అవార్డులను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని, అవార్డు గ్రహీతల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగాలని కమిటీ ఛైర్మన్, సభ్యులకు మంత్రి స్పష్టం చేశారు.

అవార్డుల నిర్వహణలో ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ముకుంద రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని, ప్రదానోత్సవానికి రెండు లేదా మూడు వేదికల ఎంపికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో వచ్చిన అన్ని ప్రతిపాదనలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో చర్చించిన అనంతరం టెలివిజన్ అవార్డులపై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.

# విధి నిర్వహణలో గాయపడిన కానిస్టేబుళ్లు

## పరామర్శించిన సీపీ వీసీ సజ్జనర్



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్: విధి నిర్వహణలో డ్రగ్స్ తనిఖీల సందర్భంగా గాయపడిన హెచ్-న్యూ కానిస్టేబుళ్లు ఎన్. మహేందర్ యాదవ్, ఎం. వంశీధర్‌లను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ మంగళవారం పరామర్శించారు. లంగర్‌హౌజ్, ప్రశాంత్‌నగర్‌లోని వారి నివాసాలకు స్వయంగా వెళ్లిన సీపీ, వారి ఆరోగ్య పరిస్థితి, చికిత్స పురోగతి గురించి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఇద్దరు కానిస్టేబుళ్లు ప్రదర్శించిన ధైర్యసాహసాలను సీపీ అభినందించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ అధైర్యపడవద్దని, పోలీసు శాఖ ఎల్లప్పుడూ తమకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ పరామర్శలో టాస్క్ ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ కూడా పాల్గొన్నారు. ఈ నెల 26న ఆబిడ్స్ తిలక్ రోడ్ ప్రాంతంలో డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారంతో హెచ్-న్యూ బృందం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో, అక్కడ ఉన్న నీలిరంగు బలేనో కారు (౧+ 12 8766) డ్రైవర్ పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో వాహనాన్ని అత్యంత వేగంగా రివర్స్ చేస్తూ సిబ్బందిపైకి దూసుకొచ్చాడు. ఈ ఘటనలో కారు చక్రం కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ కాలిపై నుంచి వెళ్లడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. మరో కానిస్టేబుల్ వంశీధర్ కూడా గాయపడ్డారు. ఇద్దరూ సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇటీవల డిశ్చార్జ్ అయి తమ ఇళ్లకు చేరుకున్నారు. పోలీసులపై ప్రాణాంతక దాడికి పాల్పడి పరారైన కారు డ్రైవర్‌పై ఆబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు హైదరాబాద్ సిటీ పోలీసులు తెలిపారు.

# చర్లపల్లి సెంట్రల్ జైలులో డీజీ సౌమ్య మిశ్రా తనిఖీ



ఆదాబ్ సైబరాబాద్, మల్కాజ్‌గిరి : తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డా. సౌమ్య మిశ్రా చర్లపల్లి సెంట్రల్ జైలును సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్మిక శాఖ కార్యదర్శి హరిచందన దాసరితో కలిసి చర్లపల్లి చెరువు పునరుద్ధరణ పనులను సమీక్షించారు. ఖైదీల వ్యవసాయ కాలనీలో అభివృద్ధి చేస్తున్న స్వామి వివేకానంద వనం, మల్టీపర్పస్ హాల్ నిర్మాణాన్ని పరిశీలించారు. జైలులో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ ఐటీఐ పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఖైదీలకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. జైళ్లను పునరావాసం, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ, కార్మిక శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైదర్‌నగర్ మైసమ్మ అమ్మవారికి బోనం

## సమర్పించిన కాంగ్రెస్ నాయకుడు గణేష్ యాదవ్



ఆదాబ్ సైబరాబాద్, హైదర్‌నగర్: ఆషాఢ మాసం సందర్భంగా మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానమేట్ గ్రామానికి చెందిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గణేష్ యాదవ్ హైదర్‌నగర్‌లోని శ్రీ మైసమ్మ అమ్మవారి ఆలయంలో బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్న గణేష్ యాదవ్, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, ప్రతి కుటుంబంపై అమ్మవారి కృపాకటాక్షాలు ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్, గంగల నరసింహ యాదవ్, కాంగ్రెస్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్,గంగల జంగయ్య యాదవ్, గంగల మల్లేష్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు గంగల రాధాకృష్ణ యాదవ్, ఉప్పల ఏకాంత్ గౌడ్, నారగోని కృష్ణ గౌడ్తో పాటు పలువురు సోదరులు, బంధుమిత్రులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. బోనాల పండుగ తెలంగాణ ప్రజల భక్తి, ఆధ్యాత్మికత, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు.

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD



## బీరప్పగడ్డ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన



ఆదాబ్ సైబరాబాద్, మల్కాజ్‌గిరి : బీరప్పగడ్డ డివిజన్‌లోని లైబ్రరీ వెనుక నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు పనులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ గురువారం పరిశీలించారు. సుమారు రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి సమీక్షించారు. కమ్యూనిటీ హాల్‌లో ప్రజలకు అనువుగా ఎక్కువ వెంటిలేషన్ ఉండేలా అదనపు కిటికీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రంగా వినియోగించే భవనం కావడంతో ప్రధాన ద్వారం విశాలంగా నిర్మించాలని అధికారులకు ఆదేశించారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించి నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. మాజీ కార్పొరేటర్ బన్నాల గీత కృషితో ఈ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, పండ్ల కిషన్ గౌడ్, వంజరి నర్సింగ్‌రావు, తిరుపతి యాదవ్, కోల వరుణ్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, వెంకట్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్‌గిరిలో బీఆర్ఎస్‌లోకి భారీ చేరికలు



ఆదాబ్ సైబరాబాద్, మల్కాజ్‌గిరి : మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో మంగళవారం పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నేరేడ్మెట్ డివిజన్ ఆర్కే పురానికి చెందిన ఆకాష్, కిరణ్ కుమార్, అనిల్‌తో పాటు పలువురు బస్తీవాసులు పార్టీ కండువా కప్పుకున్నారు. గౌతమ్‌నగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, ప్రధాన కార్యదర్శి మా శెట్టి అనిల్ కుమార్ గుప్తా కూడా బీఆర్ఎస్‌లో చేరారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ శ్రేణులు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాము యాదవ్, బైరు అనిల్, హేమంత్ పటేల్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, నర్సింగ్, గౌస్ ఇమ్రాన్, జక్కుల కిరణ్ ముదిరాజ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## జమ్మిగడ్డ పీహెచ్‌సీలో కనీస వసతులు కల్పించాలి

**బీజేపీ నాయకుల వినతి..**

**లేకుంటే ప్రజా ఉద్యమం హెచ్చరిక**



ఆదాబ్ సైబరాబాద్, కుషాయిగూడ : జమ్మిగడ్డ పబ్లిక్ హెల్త్ సెంటర్ (పీహెచ్‌సీ)లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నాయకులు మంగళవారం వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రిలో టాయిలెట్లు అధ్వాన్నంగా ఉండటం, తాగునీటి సౌకర్యం లేకపోవడం, రోగులు కూర్చోవడానికి బెంచీలు లేకపోవడం, మందుల కొరత, వైద్యులు, సిబ్బంది తగినంతగా లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోగులకు కనీస మౌలిక వసతులు కల్పించి ఆసుపత్రిని ప్రజలకు ఉపయోగకరంగా మార్చాలని డిమాండ్ చేశారు. అవసరమైన నిధులు కేటాయించి టాయిలెట్ల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, మందుల సరఫరా, సిబ్బంది నియామకంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాడూరి శ్రీనివాస్, రవి నాయక్, అనుముల మహేష్, మర్రి మోహన్ రెడ్డి, కన్నెబోయిన రమేష్ యాదవ్, రొయ్యల చిత్తారి, తూపెల్లి కృష్ణారెడ్డి, ఏనుగు సీతారాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్‌గిరి ప్రజా సమస్యలపై కమిషనర్‌కు వినతి

ఆదాబ్ సైబరాబాద్, మల్కాజిగిరి : మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్‌కు మహిళా శక్తి మై వాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు, బీజేపీ రాష్ట్ర నాయకురాలు ఎన్. హైమారెడ్డి వినతిపత్రం అందజేశారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలపై చర్యలు తీసుకోవాలని కోరారు. “మీ సమస్య--మా పరిష్కారం” కార్యక్రమం ద్వారా మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన ( పిఎంఎస్ బి వై )ను ఉచితంగా అందిస్తున్నట్లు



తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా శక్తి మహిళా సంఘం ట్రెజరర్ రమేష్ అంబటి, బీజేపీ నాయకుడు ప్రశాంత్ గౌడ్ పాల్గొన్నారు.

# కాలుష్యకోరల్లో అంకిరెడ్డిపల్లి!

- కాలుష్య నీటితో పంటలు నాశనం
- అంకిరెడ్డిపల్లి రైతుల ఆవేదన
- పవర్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నుంచి విడుదలవుతున్న కాలుష్య నీటి వల్ల
- పంటలు నాశడం, కాలుష్య నీరు త్రాగి మూగజీవులు మృతి చెందాయన్నారు.
- తక్షణమే అధికారులు సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరారు




ఆదాబ్ సైబరాబాద్ , కీసర : అంకిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 812లో ఉన్న ఈ పవర్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నుంచి విడుదలవుతున్న కాలుష్య నీటి వల్ల వ్యవసాయ పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్య నీరు వ్యవసాయ పొలాల్లోకి చేరడంతో పంటలు ఎండిపోవడం, దిగుబడి తగ్గిపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు తెలిపారు. దీంతో తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నామని వారు వాపోయారు. అంతేకాకుండా కాలుష్య నీటి ప్రభావంతో భూమి సారవంతత కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



ఈ విషయంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఘటనాస్థలాన్ని పరిశీలించాలని, కాలుష్య నీటికి సంబంధించిన నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహించాలని రైతులు డిమాండ్ చేశారు. కాలుష్య నీరు పొలాల్లోకి చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కంపెనీ నుండి విలువడుతున్న విశావాయువులు వాళ్ళ అనేకమైన వ్యాధులు వ్యాప్తి చెంది మానవమనుగడకే పెద్ద ప్రమాదామని, ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోని అంకిరెడ్డి పల్లి గ్రామస్తులుకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరిన గ్రామస్తులు.

అదేవిధంగా, పంట నష్టాన్ని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసి బాధిత రైతులకు తగిన పరిహారం అందించాలని, కాలుష్య నియంత్రణ బోర్డు కూడా జోక్యం చేసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు విజ్ఞప్తి చేశారు.



## ఆదివాసీ చట్టాలకు ద్రోహం చేస్తే చూస్తూ ఊరుకోం

**1/70 చట్టం, ఐదో షెడ్యూల్ హక్కులను కాపాడాలి**

**మంత్రి పొంగులేటిపై తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి ఆగ్రహం**



ఆదాబ్ సైబరాబాద్, ములుగు జిల్లా: భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి డిమాండ్ చేశారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు విఘాతం కలిగించే చర్యలను చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న 1/70 చట్టం, రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని ఆయన కోరారు. “దమ్ముంటే 1/70 చట్టం, ఐదో షెడ్యూల్ పరిధిలో సెంటు భూమి కొనుగోలు చేసి చూడండి. ఆదివాసీల హక్కుల కోసం మా పోరాటం ఏమిటో చూపిస్తాం” అని అలెం కోటి పేర్కొన్నారు. గిరిజనేతరులతో కోర్టుల్లో కేసులు వేయిస్తూ, మరోవైపు విలేకరుల సమావేశాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గిరిజన ఎమ్మెల్యేలను అడ్డుపెట్టుకొని ‘జల్, జంగల్, జమీన్’పై ఆదివాసీలకు ఉన్న హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కాంట్రాక్టులు, సీఎస్ఆర్ నిధుల విషయంలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతానికి అధికారులు రావాలన్నా రాజకీయ నాయకుల అనుమతి అవసరమనే పరిస్థితి ఉండకూడదన్నారు. గవర్నర్, రాష్ట్రపతి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల రక్షణ కోసం రూపొందించిన చట్టాలు, జీవోలు పకడ్బందీగా అమలు కావాలని కోరారు. గోదావరి ఇసుక ర్యాంపుల కాంట్రాక్టులను ఇతర ప్రాంతాలకు చెందిన వారికి అప్పగిస్తున్నారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారాల్లో ఆదివాసీల ప్రయోజనాలను విస్మరించవద్దని డిమాండ్ చేశారు. ఆదివాసీలు అమాయకులని భావించి వారి సహజ సంపదను దోచుకునే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదన్నారు. ఆదివాసీల ‘జల్, జంగల్, జమీన్’తో పాటు సహజ వనరులు, హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని అలెం కోటి హెచ్చరించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజాక్షేత్రంలో పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## వెల్‌జాల్ గ్రామంలో గ్రమసభ లో రసాభాస: ప్రజలపై భౌతిక దాడికి యత్నించిన పాలకవర్గం

ఆదాబ్ సైబరాబాద్ షాద్ నగర్: తాగునీటి సమస్యను వార్డు సభ్యులు అడిగితే భౌతిక దాడికి పాల్పడిన ఉప సర్పంచ్ భర్త ఎక్కడ మినీ వాటర్ ట్యాంక్ ఉంటే అక్కడి నుంచి తెచ్చుకుని తాగండి అని వ్యంగ్యం గా మాట్లాడుతూ దూశిస్తున్న ఉప సర్పంచ్ భర్త మండల అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న గ్రామ ప్రజలు వెల్‌జాల్ గ్రామ సమస్యలను పరిష్కరించాల్సిన పాలకవర్గం, ప్రశ్నించిన ప్రజలపై తిరగబడిన ఘటన వెల్‌జాల్ గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మంగళవారం నిర్వహించిన గ్రామసభ అధికారుల వైఫల్యం, పాలకవర్గం అహంకారపూరిత వైఖరితో తీవ్ర రసాభాసగా మారింది.వెల్‌జాల్ లో అధికారం భార్య ది . పెత్తనం భర్తది గ్రామంలో ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తూ భార్యల పేరిట పదవులు పొందిన భర్తలే గ్రామసభలో సర్వాధికారులు గా వ్యవహరిస్తుండటం పై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్నామని విర్రవీగుతూ ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని మండిపడుతున్నారు.

9వ వార్డులో చుక్క నీరు లేదు గ్రామంలోని 9వ వార్డులో ఇప్పటివరకు తాగునీటి కనెక్షన్లు కూడా ఇవ్వకపోవడం పాలకవర్గం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. గుక్కెడు మంచి నీటి కోసం వార్డు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, కనీస వసతులు కల్పించడంలో పంచాయతీ ఘోరంగా విఫలమైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే భౌతిక దాడికి యత్నం గ్రామసభలో తాగునీటి సమస్యపై పాలకవర్గాన్ని ప్రశ్నించినందుకు, సమస్యను పరిష్కరించాల్సింది పోయి ప్రజల పైనే వ్యంగ్యంగా మాట్లాడుతూ, తీవ్ర పదజాలంతో దూషించారని స్థానికులు తెలిపారు. అంతటితో ఆగక, ప్రశ్నించిన వారిపై భౌతిక దాడికి సైతం యత్నించడంతో వాతావరణం మరింత వేడెక్కింది. ”ప్రశ్నించే హక్కును కాలరాస్తూ, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే గ్రామసభలో పాలకులు చూపుతున్న ఈ అహంకారాన్ని అరికట్టేది ఎవరు?” అని గ్రామస్థులు తీవ్రస్థాయిలో ప్రశ్నిస్తున్నారు.అధికారుల జోక్యం కోసం డిమాండ్ వెల్‌జాల్ గ్రామంలో నెలకొన్న ఈ దారుణ పరిస్థితులపై మండల అధికారులు, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. 9వ వార్డుకు వెంటనే తాగునీటి సౌకర్యం కల్పించాలని, గ్రామసభ లో దౌర్జన్యానికి దిగిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.



## నేరాల ఛేదనలో మరింత కీలకమైన భాధ్యతలు నిర్వర్తించాలి

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్.



అదాబ్ సైబరాబాద్, ఖమ్మం : నేరాల గుర్తింపు విషయంలో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ మరింత సమర్థవంతంగా పని చేయాలని, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు.
మంగళవారం నగరంలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్ నేరాలు, దొంగతనాలు, దోపిడీలు తదితరాలను గుర్తించడంలో దర్యాప్తు అధికారులకు అందిస్తున్న సహాయాన్ని,
పాత నేరస్థుల కదలికలకు సంబంధించి ముందస్తు సమాచార సేకరణలో సీసీఎస్ పోలీసుల పనితీరును స్వయంగా పరిశీలించారు.
అనంతరం ఆయన మాట్లాడుతూ, నేరాల ఛేదనలో కీలకంగా వ్యవహరించే సీసీఎస్‌ను పటిష్ఠ పరిచేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. అంతేకాక ప్రాపర్టీ రికవరీపై సీసీఎస్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వివిధ రకాలైన నేరాల అదుపునకు అందుబాటులో ఉన్న ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దర్యాప్తు వేగవంతం చేయడానికి క్రైమ్ బృందాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలాని ఆదేశించారు.

## ప్రపంచ హెపటైటిస్ డే

### అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్




ఆదాబ్ సైబరాబాద్, శేరిలింగంపల్లి : ప్రపంచ హెపటైటిస్ డే సందర్భంగా కొండాపూర్‌లోని హుడా ట్రేడ్ సెంటర్ సీనియర్ సిటిజన్స్ భవనంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో, కిమ్స్ హాస్పిటల్ సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎం. విజయ్ కుమార్ (మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, హెపటాలజిస్ట్) మాట్లాడుతూ, హెపటైటిస్ అనేది కాలేయ వాపుకు సంబంధించిన వ్యాధి అని తెలిపారు. వైరస్‌లు (ఏ, బి, సి, డి, ఈ) లేదా అనారోగ్యకరమైన జీవనశైలి కారణంగా ఈ వ్యాధి వస్తుందని చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది “హెపటైటిస్ -- దీన్ని అధిగమిద్దాం” అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు.
2030 నాటికి వైరల్ హెపటైటిస్‌ను ప్రజారోగ్య ముప్పుగా నిర్మూలించడమే ప్రపంచ లక్ష్యమని, అందుకోసం ప్రజల్లో అవగాహన పెంచడం, నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం, టీకాలు వేయించుకోవడం ఎంతో అవసరమని వివరించారు.
హెపటైటిస్ లక్షణాలుగా కామెర్లు, ఆకలి లేకపోవడం, అలసట, వికారంగా ఉండటం, మూత్రం రంగు మారడం, పొట్ట నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, జ్వరం, చర్మ దురదలు తదితర లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. కలుషిత ఆహారం, కలుషిత నీరు, రక్త మార్పిడి, వాడిన సిరంజీలను తిరిగి ఉపయోగించడం, రక్షణలేని శారీరక సంబంధాల ద్వారా వైరస్ సోకే అవకాశం ఉందన్నారు.
మద్యపానం, ధూమపానం, మాదకద్రవ్యాల వినియోగం, అధిక కొవ్వు ఆహారం, కల్తీ నూనెలు, ప్రాసెస్డ్ ఫుడ్ వంటి అనారోగ్యకరమైన అలవాట్లు కాలేయాన్ని దెబ్బతీసి ఫ్యాటీ లివర్‌కు దారితీస్తాయని హెచ్చరించారు. వ్యాయామం, యోగా, నడక, పౌష్టికాహారం, తాజా కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు తీసుకోవడం ద్వారా కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని సూచించారు.
హెపటైటిస్-ఏ సాధారణంగా త్వరగా కోలుకునే ఇన్ఫెక్షన్ కాగా, హెపటైటిస్-బీకి చికిత్సలు అందుబాటులో ఉన్నప్పటికీ ముందస్తు టీకా అత్యంత ప్రభావవంతమైన రక్షణ మార్గమని చెప్పారు.
హెపటైటిస్ వైరస్‌ను గుర్తించి, టీకా అభివృద్ధికి కృషి చేసిన నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ బరూచ్ బ్లంబర్గ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది జూలై 28న ప్రపంచ హెపటైటిస్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఉచితంగా లివర్ ఫంక్షన్ టెస్ట్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు జయంత్ కుమార్, నరసింహారావు, వేణుమోహన్, జి.వి. రావు, చంద్రశేఖర్‌తో పాటు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, జాకీర్ హుస్సేన్, వెంకట్ బంగారు తదితరులు పాల్గొన్నారు.


EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

# నో రిసెప్ట్.. ఓన్లీ క్యాష్

## విద్యార్థుల వద్ద దోచుకుంటున్న ఎంఎల్ఆర్ఐటి యాజమాన్యం – ఏబీవీపీ ఆరోపణ






ఆదాబ్ సైబరాబాద్, దుండిగల్ : మేడ్చల్ జిల్లా దుండిగల్‌లోని మర్రి లక్ష్మారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల వద్ద అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో విద్యార్థి కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కూకట్‌పల్లి విభాగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో కళాశాల యాజమాన్యంపై ఏబీవీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ సందర్భంగా కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ రేగోడ్ నాగేష్ మాట్లాడుతూ, ఈఏపీసెట్ ద్వారా ఎంఎల్‌అర్ ఐటిలో ప్రవేశం పొందిన విద్యార్థుల నుంచి రిపోర్టింగ్ సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుకు అదనంగా 15,000 నగదు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ అదనపు మొత్తానికి ఎలాంటి అధికారిక రశీదు ఇవ్వకుండా నగదు మాత్రమే తీసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులపై అక్రమంగా ఆర్థిక భారం మోపడం వెంటనే నిలిపివేయాలని, ఇప్పటికే వసూలు చేసిన అదనపు మొత్తానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించి, సంబంధిత విద్యార్థులకు అధికారిక రశీదులు జారీ చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. అదేవిధంగా, ఈ వ్యవహారంపై ఉన్నత విద్యాశాఖ అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. అవసరమైతే కళాశాల గుర్తింపును రద్దు చేసే దిశగా కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ ధర్నాలో ఆశిష్, నాగశేషు, విష్ణు సాయి శర్మ, ఆశ్రిత్, మహేష్, వివేక్ వర్ధన్ తదితర ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసుల తీరుపై

# సీజేఐ ఆగ్రహం.



న్యూ ఢిల్లీ : జూలై 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ నిరసనకారులపై పోలీసులు జరిపిన లాఠీచార్జ్, బలప్రయోగంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శాంతియుత నిరసనలను అణచివేయడంపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అసహనం వ్యక్తం చేశారు. బాధ్యులైన అధికారులను తేల్చేందుకు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పోలీసులు చేసిన దాడిలో ఓ యువకుడు కంటిచూపు కోల్పోయాడని, ఒక యువతి ఐసీయూలో చేరిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిరసనకారులపై మేకులు ఉన్న లాఠీలు, ఎలక్ట్రిక్ బ్యాటన్లు ఇంకా పెల్లెట్ గన్లను వాడటంపై సుప్రీంకోర్టు తీవ్రంగా మండిపడింది. సాధారణ దుస్తుల్లో ఉన్నవారు కూడా ఆందోళనకారులపై దాడులకు పాల్పడ్డారని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రజాస్వామ్యంలో నిరసనలు వ్యక్తంచేసే హక్కు అందరికీ ఉందని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. ఆందోళనలను నియంత్రించే సమయంలో పోలీసులు పరిమితులు దాటకూడదని, గతంలో కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను తుంగలో తొక్కారని వ్యాఖ్యానించింది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా టియర్ గ్యాస్, లాఠీచార్జ్ వాడకంపై కొత్త పోలీసు ప్రోటోకాల్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని సూచించింది.

## ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కోవడంలో

# 'రైతునేస్తం' కీలక పాత్ర:



హైదరాబాద్, జులై 28

రైతు చెంతకు నూతన సాంకేతికతే 'రైతునేస్తం' లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. (మంగళవారం) రైతు నేస్తం 100వ ఎపిసోడ్‌ను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రైతు – శాస్త్రవేత్త – అధికారుల అనుసంధానానికి దేశంలోనే తొలి డిజిటల్ వేదిక రైతునేస్తమని అన్నారు. 2024 మార్చి 6న ప్రారంభమైన రైతునేస్తం.. నేడు 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ఇప్పటివరకు 27.30 లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరినట్లు వెల్లడించారు. ప్రతి మంగళవారం రైతుల ప్రశ్నలకు ప్రత్యక్షంగా శాస్త్రవేత్తల సమాధానాలు ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఎల్–నినో సవాళ్లను ఎదుర్కోవడంలో రైతునేస్తం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయిల్ పామ్, ఉద్యాన, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టి సారించాలన్నారు. జులైలో 27 శాతం వర్షపాతం లోటు నమోదైందని వెల్లడించారు. ఆగస్టు 10 ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. భూగర్భ జలాల సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వివిధ జిల్లాలకు చెందిన ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు.

## హైడ్రా అధికారిగా ఎవరిని నియమించాలనే

# విచక్షణ ప్రభుత్వానికి ఉంది



న్యూఢిల్లీ, జులై 28: హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జా కోర్లు హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో పర్యటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరు కోమని స్పష్టం చేశారు. గండిపేట బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా? అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? అని వారిని నిలదీశారు. హైడ్రా తాము తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణగా సీఎం అభివర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ తమ ప్రభుత్వానికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400 పైగా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దురుద్దేశంతోనే కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. కోర్టు తీర్పుని పరిశీలించి.. ఆ తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణ పైన తమకు పూర్తి స్పష్టత ఉందని అన్నారు. కబ్జాకోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు. డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతుకుంట భూముల కేసు విచారణ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ పైవిధంగా స్పందించారు.

## అంతర్జాతీయ సంస్థలతో

# ఏపీ ప్రభుత్వం ఒప్పందం.



అమరావతి, జులై 28:

ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య రంగంలో మరో ముఖ్యమైన అడుగు పడింది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆస్ట్రాజెనెకా, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ మరియు క్యూర్ ఏఐ సంస్థలతో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షం లో ఈ ఒప్పందాలు జరిగాయి. దీని ద్వారా అమరావతిలో దేశంలోనే తొలి సారిగా 'ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ ఆంకాలజీ' విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. 1. అమరావతిలో అధునాతన క్యాన్సర్ పరీక్షల కేంద్రంఈ కేంద్రం ద్వారా ముఖ్యంగా ఊపిరితిత్తులు మరియు రొమ్ము క్యాన్సర్ బాధితులకు అవసరమైన అధునాతన జన్యు పరీక్షలు చేస్తారు. దీనివల్ల క్యాన్సర్ వ్యాధిని ముందే గుర్తించి, రోగులకు మరింత వేగంగా, కచ్చితమైన వైద్యం అందించడానికి వీలవుతుంది. 2. అందరికీ తక్కువ ధరలోనే నాణ్యమైన వైద్యంఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఆయన సూచించారు. ఈ భాగస్వామ్యంతో ఏపీ హెల్త్‌కేర్ -- రీసెర్చ్ రంగాలు సరికొత్త ఎత్తుకు ఎదుగుతాయని నిపుణులు విశ్వసిస్తున్నారు.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్

# కృష్ణారెడ్డి అరెస్ట్



హైదరాబాద్, జులై 28: సహచర ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కేసు నమోదు నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ వద్ద అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శంకరపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ కేసు దర్యాప్తును ఉమెన్స్ సేఫ్టీ వింగ్‌కు నగర పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ బదిలీ చేశారు. స్పందించిన రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డినీ చట్ట పరిధిలో ప్రొసీజర్ ప్రకారం విచారిస్తామని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో డీసీపీ మాట్లాడుతూ.. ఈ కేసులో నమోదైన సెక్షన్లు, ఆధారాలు బేస్ చేసుకొని అతడిని విచారిస్తామని చెప్పారు. అరెస్టు చేయాలా? లేక నోటీసులు ఇచ్చి విచారించాలా? అనేది అతడిపై నమోదైన సెక్షన్స్‌పై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఉదయ్ కృష్ణారెడ్డిపై కొన్ని అభియోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై పూర్తి సమాచారాన్ని తర్వాత వెల్లడిస్తామని అన్నారు. ఈ కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరుగుతుందని డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ముందు

# హైడ్రామా




న్యూఢిల్లీ, జులై 28: నీట్–యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదంతో ప్రారంభమైన ఆందోళనలు, చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీశాయి. అయితే మొదట ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కంటే ముందు ఆయనను వేరే శాఖకు మార్చాలని ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ప్రశ్నపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులతో జరిపిన తొలి చర్చల్లో కేంద్రం ధర్మేంద్ర ప్రధాన్ శాఖను మాత్రమే మార్చే ప్రతిపాదనను చేసిందని సమాచారం. అయితే ఆ ప్రతిపాదనను సీజేపీ ప్రతినిధులు పూర్తిగా తిరస్కరించినట్లు ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలను బీజేపీ ఖండించింది. అవి పూర్తిగా నిరాధారమైనవని, కల్పితమైనవని పేర్కొంది. ఈ అంశం పై బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర స్పందించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమనే ఇదన్నారు. ప్రధాన్ మంత్రిత్వ శాఖ మారుస్తామన్న ప్రతిపాదనేదీ కేంద్రం చేయలేదని చెప్పారు. ఇవన్నీ నిరాధార కథనాలేనని కొట్టిపారేశారు. కేవలం సంచలనాల కోసం ఇలాంటి అసత్య వార్తలను వ్యాప్తి చేయవద్దని హితవు పలికారు.